- నాలుగు రోజులు మహానగరంగా మారిన మేడారం
- వనదేవతలను దర్శించుకున్న కోటిన్నరకుపైగా భక్తులు
- తల్లుల సేవలో వీవీఐపీలు..
- గుండెల నిండా భక్తితో సొంతూళ్లకు పయనమైన భక్తులు

వన ప్రవేశం..

సమ్మక్క- సారలమ్మ వన ప్రవేశంతో ముగిసిన జాతర

అక్షర దర్బార్, మేడారం : కొండ, కోన మురిసిపోయింది. వాగు, వంక ఉప్పొంగింది. జంపన్నవాగు జనప్రవాహమైంది. కీకారణ్యం జనారణ్యంగా మారింది. నాలుగు రోజులు మేడారం మహా నగరంగా మారింది. దాదాపు కోటీ నలభై ఐదు లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసింది. బుధవారం జాతర ప్రారంభం కాగా.. శనివారం సాయంత్రం సమ్మక్క- సారలమ్మ వన ప్రవేశంతో ముగిసింది. భక్తులందరూ తమ స్వస్థలాలకు తిరుగు పయనమయ్యారు. బైబై సమ్మక్క- సారలమ్మ.. మళ్లీ రెండేళ్లకు వస్తామంటూ కోటి ఆశలతో బయలుదేరారు..

నాలుగు రోజులు ప్రశాంతంగా..

మేడారం మహాజాతర ఈ నెల 21వ తేదీన ప్రారంభమై 24 వతేదీన ప్రశాంత వాతావరణంలో ముగిసింది. నాలుగు రోజుల్లో దాదాపు కోటి45 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. బుధవారం సారలమ్మ వనం నుంచి జనంలోకి రావడంతో జాతర ప్రారంభమైంది. గురువారం సమ్మక్కను అధికార లాంఛనాలతో ప్రత్యేక పూజలతో గద్దె పైకి తీసుకొచ్చారు. శుక్ర, శనివారాలు వనదేవతలను భక్తులు దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వనదేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. నాలుగు రోజులపాటు ప్రశాంత వాతావరణంలో జాతర జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ బస్సులు 10 వేల ట్రిప్పులు నడిచాయి. 13మంది వీవీఐపీలు, 150 మంది వీఐపీలు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇద్దరు భక్తులు ప్రమాదవశాత్తు చనిపోయారు. 5,090 మంది భక్తులు తప్పిపోతే మిస్సింగ్ క్యాంపుల ద్వారా 5,060 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా 35 మంది ఉన్నారు. జాతర పూర్తయిన పది రోజుల వరకూ పారిశుధ్యం పనులు కొనసాగించనున్నారు.

ప్రముఖుల రాక

మేడారం జాతరకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు గవర్నర్ తమిళీ సై, కేంద్ర మంత్రి అర్జున్ ముండా హాజరయ్యారు. మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వనదేవతలను దర్శించుకున్నారు.
కాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే, చీఫ్ విప్ వడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైకోర్టు జడ్జిలు హరిప్రియ, రేవతి, డిఐజి శ్రీనివాస్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు